సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 3 । జనవరి । 2023



జిల్లాలో 15 వేల కోవిడ్ టెస్టు రాపిడ్ కిట్స్ 8లో



ట్రాక్టర్ కిందకు దూసుకెళ్లిన స్కూటీ 8లో

మెరుగైన వైద్యసేవలు అందించాలి 8లో



న్యూస్‌రీల్

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ సుమిత్ కుమార్



శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో కలెక్టర్, ఎస్పీ, పీవో, ఏఎస్పీ తదితరులు

రంపచోడవరం: ప్రభుత్వపరంగా కల్పిస్తున్న అన్ని అవకాశాలను గిరిజన యువత సద్వినియోగం చేసుకుని, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్(వైటీసీ)లో ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలిసి పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాలకు రాత పరీక్ష రాసేందుకు శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. పోలీసుశాఖ, ఐటీడీఏ సంయుక్తంగా నిర్వహిస్తున్న శిక్షణలో అభ్యర్థులు విషయాలను నేర్చుకుని, పోలీసు ఉద్యోగాల రాత పరీక్షలో విజయం సాధించాలన్నారు. వైటీసీలో 257 మంది యువకులు, 84 మంది యువతులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగాలకు శిక్షణ ఇచ్చేందుకు ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత పరీక్ష నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, కమాండెంట్ పి.కిషోర్, సీఐ సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ పోలీసింగ్‌తో మెరుగైన సేవలు



వై.రామవరంలో నూతన పోలీసు స్టేషన్ భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

వై.రామవరం: ప్రజలతో సత్‌సంబంధాలు పెట్టుకుని కమ్యూనిటీ పోలీసింగ్‌తో మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ సిబ్బందికి సూచించారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను సోమవారం ఆయన సందర్శించారు. నూతనంగా నిర్మించిన పోలీసు స్టేషన్ భవనాన్ని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ డి–42 బెటాలియన్ పోలీసులు, మహిళా పోలీసులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఏవోబీలో మావోయిస్టుల కదలికలపై ఆరా తీశారు. స్టేషన్ భద్రతా ఏర్పాట్లను, సీఆర్‌పీఎఫ్ డి–42 అదనపు పోలీసుబలగాల భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్ కట్‌చేసి, అందరికీ స్వీట్లను పంచారు. ఈకార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డి–42 బెటాలియన్ అసిస్టెంటు కమాండెంట్ ఎం.ఎల్.నాయుడు, అడ్డతీగల సీఐ వై.రాంబాబు, స్థానిక ఎస్ఐ ఎం.సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన పారిశుధ్య పనులు

కలెక్టర్ మందలింపుతో పంచాయతీ సిబ్బందిలో కదలిక



రాజవొమ్మంగిలో రోడ్డుకు ఇరువైపుల వ్యర్థాలను తొలగిస్తున్న స్వీపర్లు

రాజవొమ్మంగి: కలెక్టర్ మందలించడంతో రాజవొమ్మంగి పంచాయతీ సిబ్బందిలో కదలిక వచ్చింది. ప్రధాన రహదారికి ఇరువైపుల పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ సీసాలు వంటి వ్యర్థాలను సోమవారం యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం రంపచోడవరంలో జరిగే అధికారుల సమావేశానికి పాడేరు నుంచి రంపచోడవరానికి బయలుదేరారు. మార్గ మధ్యంలో రాజవొమ్మంగి బ్యాంకు వద్ద, షిర్డీసాయిబాబా ఆలయం వద్ద ప్రధానరహదారికి ఇరువైపుల పేరుకు పోయిన వ్యర్థాలను గమనించి అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వెంటనే పరిసరాలను శుభ్రం చేయాలని ఆదేశించారు. దీంతో పంచాయతీ సిబ్బందిలో కదలిక వచ్చింది.

గజ..గజ

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా పొగమంచు దట్టంగా కురుస్తోంది. సోమవారం అరకులోయ, పాడేరు ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో చలిగాలులు విజృంభిస్తున్నాయి. పాడేరు మండలం మినుములూరులో 12 డిగ్రీలు, అరకులోయలో 15 డిగ్రీలు,చింతపల్లిలో 16.5డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అపురూపం.. వైకుంఠనాథుని దివ్యదర్శనం

వేయి కనులు చాలవులే..!



వైకుంఠవాసుడిగా దర్శనమిచ్చిన సింహాద్రి అప్పన్న

సింహాచలం: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని సోమవారం వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్తర ద్వార దర్శనం చేసుకుని భక్తులు తరించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడై స్వామి ఆలయ ఉత్తర రాజ గోపురంలో శేషతల్పంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం తెల్లవారుజాము ఒంటి గంట నుంచి పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం వైదికులు విశేషంగా పూజలు ప్రారంభించారు. స్వామిని సుప్రభాతసేవతో మేల్కొలిపి ఆరాధన నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వైకుంఠవాసుడిగా అలంకరించారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు తొలి దర్శనం చేసుకున్న అనంతరం స్వామిని ఉత్తర రాజగోపురంలో ఏర్పాటుచేసిన వేదికపై అధిష్టింపజేశారు. ఉదయం 5.45 గంటల నుంచి 10 గంటల వరకు భక్తులకు దర్శనాన్ని అందజేశారు. అనంతరం స్వామికి సింహగిరి మాడవీధిల్లో తిరువీధి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ పూజలు నిర్వహించారు. శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎంపీ జీవీఎల్ నరసింహారావు, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర స్వామిని దర్శించుకున్నారు.

సీతారామ స్వామి.. నే చేసిన భాగ్యాలేమి

వీఆర్‌పురం/సాక్షి, పాడేరు: ఉత్తర ద్వారదర్శనంతో భక్తులు పులకించిపోయారు. జిల్లాలో వైకుంఠ ఏకాదశి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. సోమవారం వేకువజాము నుంచే పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకుని ఉత్తరద్వారం గుండా స్వామిని దర్శించి పరవశించిపోయారు. వీఆర్‌పురం మండలంలోని శ్రీరామగిరిలో వెలసిన సుందర సీతారామ చంద్ర స్వామివారు కొండ మీద ఆలయంలో ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిచ్చారు. వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా స్వామివారికి అర్చకులు ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తెల్లవారు జామున 4.00 గంటల నుంచి 6.00 గంటల వరకు ఆలయంలో ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ఉత్తర ద్వార దర్శన ప్రాశస్త్యాన్ని ఆలయ ప్రధాన అర్చకులు సామిత్రి పురుషోత్తమా చార్యులు భక్తులకు వివరించారు.అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ రేవు బాలరాజు, ఎంపీపీ కారం లక్ష్మి, వైస్ఎంపీపీ ముత్యాల గంగాభవాని, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ తదితరులు పాల్గొన్నారు. అరకు, పాడేరుల్లోని పలు ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహించారు. సుండ్రుపుట్టు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పాడేరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



ఉత్తరద్వారం గుండా భక్తులకు దర్శనమిస్తున్న సుందరసీతారామచంద్రస్వామివారు

వేకువజాము నుంచే వేంకటేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు తాకిడి నెలకొంది.అన్ని వర్గాల భక్తులు భక్తి శ్రద్ధలతో స్వామి వారికి పూజలు జరిపారు. మధ్యాహ్నం వరకు ఆలయాల్లో ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం కూడా భక్తులు ఆలయాలకు తరలివచ్చారు.



సింహాచలంలో ఉత్తరద్వార దర్శనానికి క్యూల్లో వేచి ఉన్న భక్తులు

75.10 శాతం పింఛన్ల పంపిణీ

జిల్లాలో రెండవ రోజు హుషారుగా పంపిణీ

సాక్షి,పాడేరు: జిల్లాలోని 22 మండలాల్లో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం రెండవ రోజు సోమవారం హుషారుగా జరిగింది. పాత వారితో పాటు ఈనెల నుంచి ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్‌దారులకు వలంటీర్లు నగదు పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు,సర్పంచ్‌లు భాగస్వాములవుతున్నారు. జిల్లాలోని కొత్తవి 5,398తో కలుపుకొని మొత్తం 1,25,465 మంది సామాజిక పింఛన్‌దారులు ఉన్నారు. సోమవారం సాయంత్రం నాటికి 94,220(75.10శాతం) మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు డీఆర్‌డీఏ పీడి మురళీ సాక్షికి తెలిపారు.



సలుగు పంచాయతీలో కొత్త పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ,సర్పంచ్‌లు

జిల్లాలో పంపిణీ వివరాలు

మండలం	నగదు పొందిన పింఛన్‌దారులు	మండలం	నగదు పొందిన పింఛన్‌దారులు	మండలం	నగదు పొందిన పింఛన్‌దారులు
గంగవరం	3,108	డుంబ్రిగుడ	4,895	కొయ్యూరు	4,900.
రాజవొమ్మంగి	5,040	అనంతగిరి	4,586	వై.రామవరం	1,715
రంపచోడవరం	3,551	పాడేరు	4,767	కూనవరం	3,617
పెదబయలు	4,764	జీకే వీధి	5,559	ఏటపాక	5,516
దేవీపట్నం	3,372	అడ్డతీగల	3,792	వి.ఆర్.పురం	3,331
ముంచంగిపుట్టు	4,865	మారేడుమిల్లి	1,424	హుకుంపేట	5,789
		జి.మాడుగుల	4,459	చింతూరు	3,951
		చింతపల్లి	6,077	అరకులోయ	5,142

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ సుమిత్ కుమార్

రంపచోడవరం: ఏజెన్సీలో నూరు శాతం ఆస్పత్రి ప్రసవాలు జరిగేందుకు వైద్య ఆరోగ్యశాఖ కృషి చేయాలని, హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో కలెక్టర్ సోమవారం పీవో సూరజ్ గనోరేతో కలిసి రంపచోడవరం డివిజన్ పరిధిలో గల 18 పీహెచ్‌సీల వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏజెన్సీలో హైరిస్క్ గర్భిణులను గుర్తించి, రక్తహీనత లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సబ్ సెంటర్ల పరిధిలోని గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, వైద్యులు.. ఇంటింటికీ వెళ్లి గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని తెలిపారు. పీహెచ్‌సీల్లో ప్రతీ నెలా ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయో ఆరా తీశారు. పాఠశాలల్లో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి సమస్యలు ఉంటే మందులు ఇవ్వాలన్నారు. మారుమూల గ్రామాలకు 104 సేవలు అందాలని ఆదేశించారు. ఏజెన్సీలో అంబులెన్స్‌ల సర్వీసులపై కలెక్టర్ సమీక్షించారు. పీహెచ్‌సీల్లో మందులు అందుబాటులో ఉండాలని, రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించాలని, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆరోగ్యశ్రీకి సంబంధించి కేసులను పరిష్కరించే విధంగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని కోఆర్డినేటర్ డేవిడ్‌ను ఆదేశించారు. పీహెచ్‌సీల్లో ఫేస్ రికగ్నేషన్ హాజరు తప్పని సరి అన్నారు. ల్యాబ్‌లకు కావాల్సిన పరికరాలను ఐటీడీఏ ఏర్పాటు చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో గంగవరం, వాడపల్లి పీహెచ్‌సీలో వైద్య సేవలు అందించిన మొగలపూడి సత్యతేజ పదోన్నతిపై ఏఐఏయూ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్‌గా వెళుతున్న సందర్భంగా కలెక్టర్ , పీవోలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో అనూష తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించిన కలెక్టర్

రంపచోడవరం సమీపంలోని జాగరంపల్లిలోని అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు అధ్యాపకులతో మాట్లాడి బోధన తీరును అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో వ్యవసాయ భూములను పరిశీలించారు.

జిల్లాలో 8,074 టన్నుల ధాన్యం కొనుగోలు

సివిల్ సప్లయ్స్ డీఎం గణేశ్‌కుమార్

రాజవొమ్మంగి: జిల్లా వ్యాప్తంగా సోమవారం నాటికి 1295 మంది రైతుల నుంచి 8,074 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు సివిల్‌సప్లయ్స్ డీఎం గణేశ్ కుమార్ తెలిపారు. దీని విలువ రూ.16.45 కోట్లు, కాగా ఇప్పటి వరకు 472 మంది రైతులకు రూ.5.36 కోట్ల చెల్లింపులు జరిగాయని చెప్పారు. ఆర్బీకేల ద్వారా ధాన్యం విక్రయిస్తున్న రైతులకు 15 రోజుల్లోనే చెల్లింపులు జరుగుతున్నాయని గణేశ్ కుమార్ అన్నారు. జిల్లాలో 23వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్నది లక్ష్యం కాగా, 34 శాతం మేరకు కొనుగోళ్లు పూర్తయ్యాయని చెప్పారు.



లారీలో తరలిస్తున్న ధాన్యం బస్తాలు

చదువులమ్మ తొలి ఒడి

- అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్య
- 19 రకాల మెటీరియల్స్‌తో బోధన
- చిన్నారుల్లో మానసిక, శారీరక వృద్ధికి శిక్షణ
- జిల్లాలో విజయవంతంగా ప్రీప్రైమరీ స్కూళ్లు

రంపచోడవరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఊహకందని విధంగా సమూల మార్పులు వచ్చాయి. చిన్నారుల మానసిక, శారీరక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కిట్స్ అందజేయడంతో పాటు ఇంగ్లిష్ బోధనకు ప్రత్యేక సిలబస్ రూపొందించి, పుస్తకాలు అందజేశారు. రెగ్యులర్ పాఠశాలల్లో వలే ఇక్కడ కూడా మూడేళ్ల, నాలుగేళ్ల లోపు పిల్లల కోసం వేర్వేరుగా ప్రత్యేక పుస్తకాలు అందజేశారు. చిన్నారుల్లో ఏంటి, ఎందుకు, ఎలా అని ఆలోచింపచేయడానికి, కుతూహలంకలిగించడంతో పాటు సృజనాత్మక శక్తిని పెంపొందించే విధంగా ఈ కేంద్రాలను ప్రభుత్వం తీర్చిదిద్దింది. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీప్రైమరీ స్కూళ్లుగా మార్చిన తరువాత పౌష్టికాహారం అందించడంతో పాటు ప్రాథమిక పాఠశాలలకు వెళ్లేందుకు చిన్నారులను సిద్ధం చేస్తున్నారు. ఇందుకు కోసం 19 రకాల మెటీరియల్స్‌తో కూడి కిట్‌లను అంగన్‌వాడీ కేంద్రాలు, మినీ అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేశారు.శిక్షణ పొందిన అంగన్‌వాడీ టీచర్లు వాటి ద్వారా చిన్నారులకు బోధిస్తున్నారు. జిల్లాలో ప్రీప్రైమరీ స్కూళ్లు విజయవంతంగా నడుస్తున్నాయి. జిల్లాలో 1,791 ప్రధాన, 1,423 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 3 నుంచి 5 సంవత్సరాల చిన్నారులు 47,737 మంది ఉన్నారు.



స్టోరీ బుక్స్

కిట్‌లో ఉండేవి ఇవే..

సెన్సరీ మ్యాట్, సాఫ్ట్ బాల్స్, ఉడెన్ నంబర్ పజిల్, పెగ్‌బోర్డు షేప్స్, బీడ్స్ విత్ స్ట్రింగ్, ఉడెన్ లేసింగ్ షూస్, బిల్డింగ్ బాక్స్, గ్లూ స్టిక్స్, కలర్ పేపర్స్, వాటర్ కలర్స్, కలర్ క్రేయాన్స్, ట్రేసింగ్ బోర్డు ఆఫ్‌పేటర్న్స్, డప్లి, స్లేట్ ఫర్ కిడ్స్, డస్ట్ ఫ్రీ చాక్స్, బాస్కెట్ బాల్ హూప్ విత్ బాల్, స్టోరీ బుక్స్ ఉంటాయి.

ఎలా ఉపయోగపడతాయి

కిట్స్ ద్వారా బోధన వల్ల పిల్లల్లో అవగాహన పెరుగుతుంది. రంగులు, గరుకుదనం, మృదుత్వాన్ని గుర్తించగలుగుతారు. పరిశీలనాశక్తి, ఆలోచించడం, ఆకృతులు తెలుసుకోవడం, ఆకారాలు, నిర్మాణాలు చేయగలడం, పనిమీద శ్రద్ధ, తార్కికంగా ఆలోచించడం అలవాటవుతాయి. మూడు సంవత్సరాల వయసు దాటిన పిల్లలకు కథలు పుస్తకాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్నారు. మేధాశక్తి, భాషాభివృద్ధికి ఈ పుస్తకాలు ఉపయోగపడతాయి. శారీర, మానసిక అభివృద్ధి కలిగేలా కిట్‌లను రూపొందించారు.



అంగన్‌వాడీలకు సరఫరా చేసిన కిట్‌లో సామగ్రి

ఆలోచనాశక్తి పెంపు



ప్రీస్కూళ్ల ద్వారా పిల్లల్లో ఆలోచన శక్తి పెరుగుతుంది. శాస్త్రీయ పద్ధతిలో నేర్చుకునే విధంగా అంశాలను రూపొందించారు. ప్రీ స్కూళ్లకు అందజేసిన మెటీరియల్ ఎంతో ఉపయోగపడుతుంది. 19 రకాల పరికరాల ద్వారా వివిధ అంశాలపై చిన్నారుల్లో నైపుణ్యం పెరుగుతుంది. ఇప్పటికే అంగన్‌వాడీ పిల్లల్లో చాలా మార్పు వచ్చింది.

–సంధ్యారాణి, సీడీపీవో, రంపచోడవరం

బీఐఎస్ ప్రమాణాలు తప్పనిసరి

జాయింట్ డైరెక్టర్ రాజశేఖర్

సాక్షి,పాడేరు: పాలపాడి నుంచి క్షిపణుల వరకు ప్రతీ ఉత్పత్తికి బీఐఎస్ ప్రమాణాలు తప్పని సరిగా పాటించాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ జాయింట్ డైరెక్టర్ కె.రాజశేఖర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీఐఎస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) నిర్ధేశిత ప్రమాణాలను నిర్ణయిస్తుందని, వాటిని తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసే ఐఎస్ఐ మార్కు ఉన్న వస్తువులను మాత్రమే వినియోగించాలన్నారు. ఐఎస్ఐ మార్కు ఆవశ్యకత, బీఐఎస్ ప్రమాణాలను నిర్ణయించే పద్ధతులు, ఫిర్యాదు చేసే విధానాలు, ఇతర అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సుమారు 450 రకాల ఉత్పత్తులకు ప్రస్తుతం ఐఎస్ఐ మార్కు జారీ చేశామన్నారు. 30 వేలకు పైగా ప్రమాణాలను నిర్ధేశించినట్టు చెప్పారు. నిర్మాణరంగానికి కూడా ఐఎస్ఐ ఉందన్నారు. ఆక్సిజన్,ఎల్‌పీజీ సిలెండర్‌లు, రెగ్యులేటర్లకు బీఐఎస్ ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. నాణ్యత తనిఖీల కోసం రాష్ట్రంలో సుమారు 350 లేబొరేటరీలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు.ఈ కార్యక్రమంలో స్టాండర్డ్స్ ప్రమోషన్ అధికారి డి.కృష్ణవీర వర్మ, జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ రాజశేఖర్

పక్కగా సమగ్ర భూ సర్వే

జేసీ శివ శ్రీనివాస్

ముంచంగిపుట్టు: వందేళ్ల తరువాత నిర్వహిస్తున్న భూ రీ సర్వేను పక్కగా జరపాలని జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాస్ తెలిపారు. జగనన్న శాశ్వత భూహక్కు, సమగ్ర భూ సర్వేపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వీఆర్‌వోలు, సర్వేయర్లు,రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు గ్రామాల్లో జరిగిన సర్వేపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.గ్రామాల సరిహద్దులు,రైతుల భూములు, ప్రభుత్వ భూములను గుర్తిస్తూ సర్వే చేయాలని సూచించారు.రైతుల సమక్షంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్వే జరపాలన్నారు. అనంతరం వనభసింగి పంచాయతీ లుంగాపుట్టులో జరుగుతున్న సమగ్ర భూ రీసర్వేను జేసీ పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేసీ మాట్లాడుతూ రైతుల మధ్య భూముల సరిహద్దుల తగాదాలు నివారించేందుకు భూ సర్వే చేస్తున్నామని,రెవెన్యూ సిబ్బంది సర్వే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పారదర్శకంగా సర్వే చేయాలని సూచించారు. అనంతరం పలు గ్రామాల భూ సమస్యలపై రైతులతో జేసీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నర్సమ్మ, ఆర్ఐలు రవికుమార్,మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



లుంగాపుట్టులో భూ సర్వేను పరిశీలిస్తున్న జేసీ శివశ్రీనివాసరావు

క్లుప్తంగా

రిసార్ట్స్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరి


వంజంగి రిసార్ట్స్ యజమానులతో సమావేశం నిర్వహిస్తున్న సీఐ సుధాకర్

పాడేరు రూరల్: పర్యాటక ప్రాంతాల్లోని రిసార్ట్స్‌ల్లో యజమానులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పాడేరు సీఐ సుధాకర్ సూచించారు. సోమవారం పాడేరు సర్కిల్ కార్యాలయంలో వంజంగి పరిసర ప్రాంతాల్లో రిసార్ట్స్ నిర్వహిస్తున్న యజమానులతో సమావేశం నిర్వహించారు. రిసార్ట్స్‌కు వచ్చే పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఆయన పేర్కొన్నారు. పర్యాటకుల వివరాలను రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకూడదన్నారు. ఈవెంట్ల నిర్వహణపై ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించిన రిసార్ట్స్‌ల లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. పాడేరు ఎస్‌ఐలు లక్ష్మణ్, రంజిత్ పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్ మృతికి సంతాపం


వరహాలమ్మ(ఫైల్)

జి.మాడుగుల: గడుతూరు పంచాయతీ గొంపం గ్రామ వలంటీర్ మాతే వరహాలమ్మ(32) విధి నిర్వహణలో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందారు. గ్రామంలో ఆదివారం పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామానికి కిలోమీటరు దూరంలో సిగ్నల్ పాయింట్‌కు వెళ్లి సింక్ చేసి వస్తున్న సమయంలో ఉన్నపళంగా కుప్పకూలిపోయి తీవ్ర అస్వస్థతకు గురై కొద్ది సేపటికి మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు. 20 రోజుల కితం అనారోగ్యంతో పాడేరు ఆస్పతిలో చికిత్స పొంది ఇటీవల ఇంటికి వచ్చిందన్నారు. ఆమె మృతికి మండల వలంటీర్ల సంఘం, సచివాలయ సిబ్బంది ఈ సందర్భంగా సంతాపాన్ని తెలియజేశారు.

సమస్యల పరిష్కారానికి సీఎం హామీ

తాడేపల్లిలో సీఎంను కలిసిన ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి


సీఎంకు వేంకటేశ్వరుడి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఎమ్మెల్యే

గంగవరం/రంపచోడవరం: రంపచోడవరం నియోజకవర్గంలో సమస్యలు పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తగిన హామీ ఇచ్చారని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. సోమవారం తాడేపల్లిలోని క్యాంప్ ఆఫీసులో సీఎంను ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలను వివరించారు. గోదావరి వరదలకు నష్టపోయిన ప్రతీ ఇంటికి తక్షణ సాయం రూ.10 వేలు బాధితులకు అందలేదన్నారు. దీనికి సీఎం స్పందించి వెంటనే బాధితులకు పరిహారం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారన్నారు. ఏజెన్సీలో పదెకరాల భూమి ఉన్నా ఎటువంటి ఆదాయం ఉండదని, దానివల్ల వారికి అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆగిపోతున్నాయని వాపోయారు. అటువంటి వారికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు. ఏజెన్సీలో చాలా కాలంగా జీవనం సాగిస్తున్న వాల్మీకులకు కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిచిపోతున్నాయన్నారు. వారి సెల్ఫ్ డిక్లరేషన్ మీద సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. అటవీశాఖ అభ్యంతరాలు వల్ల రోడ్ల నిర్మాణాలు ఆగిపోయాయని, ఫారెస్టు క్లియరెన్స్ ఇచ్చి అవి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎంను కోరానన్నారు. గిరిజనులు ఆరాధ్య దైవం స్వయంభూ గండి పోసమ్మ అమ్మవారి ఆలయం పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురవుతుందన్నారు. సంగమేశ్వరంలోని అమ్మవారి దేవాలయంలాగా నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు.

భూపతిపాలెం కెనాల్ అభివృద్ధికి చర్యలు..

భూపతిపాలెం రిజర్వాయర్ ద్వారా పూర్తిస్థాయి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేలా కెనాల్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సీఎంను కోరినట్లు ఎమ్మెల్యే వివరించారు. ఇటీవల గంగవరంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో సర్పంచ్ అక్కమ్మ, ఉప సర్పంచ్ పరదా వెంకటేశ్వరరావుదొర, వైస్ ఎంపీపీ గంగాదేవి స్థానిక ఆయకట్టు రైతులు ఈ సమస్యను తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. భూపతిపాలెం కెనాల్ నుంచి కుసుమరాయి నేరేడు మెట్ట, గంగవరం వరకు కెనాల్ అభివృద్ధికి కెనాల్ లైనింగ్ కాంక్రీటు నిర్మాణానికి సర్వే నిర్వహిస్తామని సీఎం హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

చింతూరు: ఆస్పత్రికి వచ్చే రోగులకు అలసత్వం వహించకుండా మెరుగైన వైద్యం అందించాలని చింతూరు ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. ఆయన సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రిని సందర్శించి వైద్యులకు అందిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. ముందుగా చిన్న పిల్లల విభాగాన్ని పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. చిన్నారులకు అందిస్తున్న వైద్యసేవలు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్‌ను పరిశీలించి పరీక్షల తీరును పరిశీలించారు. స్వయంగా రక్తపరీక్ష చేయించుకుని ఫలితాన్ని నిర్ధారించుకోవడంతో పాటు మైక్రోస్కోప్ ద్వారా ఎలాంటి పరీక్షలు నిర్వహిస్తున్నారనే దాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ల్యాబ్‌లో పరికరాలతో పాటు మరమ్మతులకు గురైన ఎక్స్‌రే ప్లాంట్ గురించి ఆయన వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. జనరల్ వార్డు, ప్రసూతి వార్డు, ఓపీ వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడారు. ఇక్కడ స్పెషలిస్టు వైద్యులతో మెరుగైన వైద్య సేవలందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అత్యవసర పరిస్థితిలో తప్ప మిగిలిన వైద్య సేవలు స్థానికంగానే అందేలా చూస్తున్నామన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను పారదోలాలని వినతి


డీఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

సాక్షి, పాడేరు: మూఢ నమ్మకాలతో అనేకమంది జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వీటి నుంచి విముక్తి కలిగించి, వారికి ఉపాధి కల్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి దయానిధిని దళిత మహిళ ఉత్తరాంధ్ర అధ్యక్షురాలు మరియమ్మ, గిరిజనులు సోమవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతగిరి మండలం మల్లంపేట, ఆర్మన్‌గరువు, చింతపాక, బల్లగరువు కొంది గ్రామాల్లో కొంతమంది గిరిజన మహిళలు విచిత్రంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నిస్తే దేవుడు పేరు మీద వచ్చే కానుకలతో బతుకుతున్నామని సమాధానం ఇస్తున్నారని వాపోయారు. అలాంటి వారిని గుర్తించి, మూఢ నమ్మకాల నుంచి దూరం చేయాలని కోరారు. కాదల రామకృష్ణ, లక్ష్మి, బాబూరావు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న సీఐ జీడిబాబు

అరకులోయ రూరల్: శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు అరకులోయ సీఐ జీడిబాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రధానంగా పర్యాటక కేంద్రం కావడంతో ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. లాడ్జీలు, హోటళ్లు, రిసార్ట్స్ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. సందర్శిత ప్రాంతాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా సమాచారం ఇవ్వాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లబ్బర్తిలో చిరుజల్లులు

రాజవొమ్మంగి: లబ్బర్తి పంచాయతీలో సోమవారం సాయంకాలం ఓ మోస్తరు వర్షం పడింది. దీనితో కొన్ని చోట్ల రాసులుగా పోసిన ధాన్యం, ధాన్యం బస్తాలను తడిసిపోకుండా కాపాడుకొనేందుకు రైతులు అవస్థలు పడ్డారు. కాసేపటికి వర్షం తగ్గిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

తక్కువ ధరతో జీసీసీ కాఫీ కొనుగోలు

తనిఖీల్లో గుర్తించిన మండల హార్టికల్చర్ అధికారి పద్మావతి


వారపు సంతలో కాఫీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారి, సిబ్బంది

పెదబయలు: స్థానిక వారపు సంతలో జీసీసీ కాఫీ కొనుగోలు కేంద్రంలో ప్రభుత్వం మద్దతు ధర కంటే తక్కువకే కొనుగోలు చేస్తున్నారని మండల హార్టికల్చర్ అధికారి పి. పద్మావతి విస్మయం వ్యక్తం చేశారు. కలెక్టర్, ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు సోమవారం ఆమె కాఫీ కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. కిలో కాఫీ పార్చ్‌మెంట్ రూ.270కు కొనుగోలు చేయాల్సి ఉండగా, రూ.150 నుంచి రూ.160లకే కొనుగోలు చేస్తున్నారని, కాఫీలో చెర్రి, రోబుస్ట చెర్రి రకాలను తక్కువ ధరతోనే కొనుగోలు చేశారని, కాఫీ ధరల పట్టిక ఏర్పాటు చేయలేదని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. అనంతరం జీసీసీ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడారు. ఈ విషయంపై స్థానిక జీసీసీ మేనేజర్‌ను సాక్షి వివరణ కోరగా రైతులు కాఫీని ఒకటి రెండు రోజులపాటు డ్రై చేసి కొనుగోలు కేంద్రానికి తెస్తున్నారని, బాగా ఎండిన కాఫీకి మాత్రమే రూ.270 ధర ఇస్తున్నామని, తడిగా ఉండడం వల్ల తక్కువ ధర లభిస్తుందని వివరణ ఇచ్చారు. రైతులు కాఫీని బాగా ఎండిస్తే మంచి మద్దతు ధర వస్తుందన్నారు. ధరల పట్టిక ఏర్పాటు చేస్తామన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

ఏఎస్పీ మహేశ్వరరెడ్డి


టోర్నమెంటును ప్రారంభిస్తున్న ఏఎస్పీ మహేశ్వరరెడ్డి

చింతూరు: క్రీడల్లో రాణించడం ద్వారా గ్రామీణ యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. యూత్ ఆధ్వర్యంలో పోతనపల్లిలో క్రికెట్ టోర్నమెంటును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని యువతలో ఎంతో ప్రతిభ దాగుంటుందని, ఇలాంటి టోర్నమెట్లు నిర్వహించడం ద్వారా దాన్ని వెలికితీసే అవకాశముంటుందని తెలిపారు. క్రీడలు ఐకమత్యంతోపాటు మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. ఈ టోర్నమెంట్లో నాలుగు మండలాలకు చెందిన 80 జట్లు పాల్గొన్నాయి. ఎస్‌ఐ యాదగిరి, గ్రామపెద్దలు మడివి రాజులు, రమేష్, రాజబాబు, యూత్ సభ్యులు మడకం లక్ష్మణ్, సూరిబాబు, గంగులు పాల్గొన్నారు.

అర్జీలను పరిష్కరించిన పీవో


రంపచోడవరం ఐటీడీఏలో అర్జీలు స్వీకరిస్తున్న పీవో, సబ్ కలెక్టర్

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్ 25 అర్జీలు స్వీకరించారు. వీటిలో కొన్నింటికి పరిష్కారం చూపారు. మిగిలినవి పరిష్కారం కోసం ఆయా శాఖల అధికారులకు అందజేశారు. పోలవరం ప్రాజెక్టు ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి సంబంధించి అర్జీలు సమర్పించారు. సాయి నగర్‌లో భూమి సమస్య పరిష్కరించాలని మడి తమన్నదొర దరఖాస్తు చేశారు. దేవీపట్నం మండలం కొండమొదలు, కె. గొందూరు గ్రామాలకు చెందిన వారు ఆర్ అండ్ఆర్ ప్యాకేజీకి సంబంధించిన ఇళ్లు మంజూరు చేయాలని ముళ్ల వెంకటలక్ష్మి కోరారు. పూడిపల్లి గ్రామానికి చెందిన 40 మందికి గృహాలు నిర్మించాలని కోరారు. ఏపీవో సీహెచ్ శ్రీనివాసరావు, ఇంజినీర్లు నాగేశ్వరరావు, డాక్టర్ అనూష, ఏపీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక కృషి


డీఎఫ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రేంజ్ అధికారులు

చింతపల్లి: గిరిజన గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానిక డీఎఫ్‌వో సూర్యనారాయణ అన్నారు. సోమవారం అటవీ శాఖ ఉద్యోగులు తన కార్యాలయంలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి పుష్ప గుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన సంవత్సరాన్ని పురష్కరించుకుని అంతా పర్యావరణ పరిరక్షకు కృషి చేయాలని సూచించారు. గిరిజనుల్లో అవగాహన కల్పించడం ద్వారా అడవులను కాపాడు కోవచ్చాన్నారు. ఈ కార్యక్రమం రేంజ్ అధికారులు పాత్రుడు, భార్గవవర్మ, శ్రీనివాసరావు, డీఆర్‌వో వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాను

పింఛన్ మంజూరుతో దివ్యాంగ బాలిక ఆనందం


పింఛను అందజేస్తున్న ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్

చింతపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి తాను ఎంతో రుణపడి ఉంటానని కందులగాది గ్రామానికి చెందిన దివ్యాంగురాలు పాంగి ఉమా(11) తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన దివ్యాంగ పింఛన్‌ను ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్ సదరు బాలికకు సోమవారం అందజేశారు. దివ్యాంగ పింఛన్ కోసం గత ప్రభుత్వం నుంచి ఆ బాలిక పలు దఫాలుగా దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. ఇటీవల వలంటీరు పరమేశ్వరరావు ఆన్‌లైన్లో నమోదు చేయడంతో పింఛను మంజూరైంది. దీంతో ఉమాతోపాటు ఆమె కుటుంబ సభ్యులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీడీవో లాలం సీతయ్య, కోఆప్షన్ సభ్యుడు నాజర్ వలీ, సీఐ రమేష్, అరకు పార్లమెంట్ జిల్లా నాయకుడు గణబాబు, ఎంపీటీసీ దారలక్ష్మి పాల్గొన్నారు.

• తండ్రి ప్రేమ ఆకాశమంత



తండ్రి ప్రేమకు హద్దులుండవు.. పిల్లలపై తనకున్న అనుబంధం గురించి ఎంత చెప్పినా తక్కువే.. తాజాగా పొలానికి బయలుదేరిన ఓ తండ్రి వెంట కుమారుడు వెంటబడ్డాడు. కొంత సేపటికే నడవలేనని మొండికేశాడు. ఎత్తుకోవాలని మారాం చేశాడు. దాంతో చేతి సంచినే ఊయలగా చేసి భుజంపై పెట్టుకుని ఇలా పొలం బాట పట్టాడు. ఈ ఘటన అత్యంత మారుమూల గ్రామం బుంగాపుట్టు పంచాయతీ ముజ్జిగూడలో సోమవారం సాక్షి కెమెరాకు చిక్కింది.
- ముంచంగిపుట్టు

ట్రాక్టర్ కిందకు దూసుకెళ్లిన స్కూటీ

- గిరిజన యువకుడి మృతి
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు


మృతిచెందిన గిరిజన యువకుడు ఈశ్వరరావు


ప్రమాద సంఘటన దృశ్యాలు

సాక్షి, పాడేరు: పట్టణంలోని తలారిసింగి జంక్షన్ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ వెనుక భాగంలోకి స్కూటీ దూసుకెళ్లడంతో గిరిజన యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరి గిరిజన యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. హుకుంపేట మండలం దిగుడుపుట్టు నుంచి స్కూటీపై గిరిజన యువకులు ఈశ్వరరావు, త్రినాథ్, గుల్లెలి సాయికుమార్‌లు సాయంత్రం పాడేరు బయలుదేరారు. తలారిసింగి జంక్షన్‌లో ఎదురుగా వస్తున్న పల్సర్ బైకును తప్పించే ప్రయత్నంలో ముందు వెళ్తున్న ట్రాక్టరు వెనుక భాగంలోకి స్కూటీ దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో గడ్డంగి ఈశ్వరరావు(23)తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్కూటీ వెనుక కూర్చున్న గుల్లెలి సాయికుమార్, త్రినాథ్ లకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని హుటాహుటిన పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించారు. త్రినాథ్‌కు ఎడమకాలు విరిగిపోయింది. సాయికుమార్‌కు పలు చోట్ల గాయాలయ్యాయి. ఈ ప్రమాద సంఘటనపై పాడేరు ఎస్‌ఐ లక్ష్మణ్ కేసు నమోదు చేశారు.

ఉదయం నుంచి వరిపనలు మోసి..

ఈ ప్రమాదంలో మృతి చెందిన ఈశ్వరరావు, గాయపడ్డ త్రినాథ్, సాయికుమార్‌లు మిత్రులేకాక, బంధువులు కూడా. ప్రస్తుతం ధాన్యం నూర్పుల పనులు కావడంతో ముగ్గురూ ఉదయం నుంచి సాయంత్రం వరకు కోసిన వరిపనల మోతలో పాల్గొన్నారు. సాయంత్రం సరదాగా పాడేరుకు స్కూటీపై బయలుదేరారు. ఉదయం నుంచి పనులతో అలసిన ఈ ముగ్గురు మిత్రులు ఆటవిడుపుగా బయల్దేరి పాడేరుకు కొద్ది నిమిషాల్లో చేరుకుంటారనగా ప్రమాదానికి గురయ్యారు.

దిగుడుపుట్టులో విషాదం

గిరిజన యువకుడు ఈశ్వరరావు మృతిచెందడం, ఒకే కుటుంబానికి చెందిన త్రినాథ్, సాయికుమార్‌లు తీవ్రంగా గాయపడిన సంఘటనతో హుకుంపేట మండలంలోని దిగుడుపుట్టు గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. ముగ్గురు ఆడపిల్లల తర్వాత పుట్టిన ఈశ్వరరావును తల్లిదండ్రులు కొండబాబు, ముత్యాలమ్మలు అల్లారుముద్దుగా పెంచుకున్నారు. టెన్త్ వరకు చదివిన ఈశ్వరరావు వ్యవసాయంపై మక్కువతో పై చదువులకు దూరమయ్యాడు. తల్లిదండ్రులకు తోడుగా ఇంటికి పెద్దదిక్కుగా మారాడు. ఈ పరిస్థితిలో ఈశ్వరరావు మరణం తల్లిదండ్రులకు తీవ్ర వేదన కలిగించింది. ప్రమాద సంఘటనను తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు కల్పించాలని వైద్యులకు ఫోన్‌లో ఎమ్మెల్యే సూచించారు. అలాగే ఎంపీపీ రాజుబాబు, జెడ్పీటీసీ రేగం మత్స్యలింగంలు కూడా ప్రమాద సంఘటనపై విచారం వ్యక్తం చేశారు.

బహుమతి గ్రహీతలకు అభినందన


ప్రతిభ విద్యార్థినులతో హెచ్‌ఎం పల్లవి, ఉపాధ్యాయులు

ముంచంగిపుట్టు: పాడేరులో గత నెల 22, 23 తేదీల్లో నిర్వహించిన గిరి విజ్ఞాన సంబరాల్లో ప్రతిభ కనబరిచిన స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక పాఠశాల-2 విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు. బయాలజికల్ సైన్స్‌లో మొదటి బహుమతి, మ్యాథమెటిక్స్‌లో ద్వితీయ స్థానంతోపాటు జిల్లా స్థాయి క్రీడా ఉత్సవాల్లో 400, 800 మీటర్ల పోటీల్లో మొదటి స్థానంలో నిలిచారు. సోమవారం వీరిని హెచ్‌ఎం పి.పల్లవి, ఉపాధ్యాయులు అభినందించారు. ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం పి.రాధాకృష్ణ, పీడీ అశోక్‌కుమారి, ఉపాధ్యాయులు రత్నకుమారి, రాజేశ్వరి, కౌసల్య, ప్రమీల, పుష్పజ్యోతి, అనురాధ, భారతి పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ ఆటగాళ్లకు అభినందన

విశాఖ స్పోర్ట్స్: భారత్ రైల్వేస్ జట్టు సభ్యులు వెంగళరావు, గణేష్‌లను వాల్తేర్ డీఆర్‌ఎం అనూప్ కుమార్ సత్పతి అభినందించారు. వాల్తేర్ డివిజన్‌కు చెందిన వీరిద్దరూ రైల్వేస్ జట్టు తరఫున సీనియర్ నేషనల్ బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నారు. కొల్లాంలో జరిగిన ఈ చాంపియన్‌షిప్ ఫైనల్స్‌లో రైల్వేస్ జట్టు 39-38, 35-24 పాయింట్ల తేడాతో తమిళనాడుపై విజయం సాధించింది.

జిల్లాలో 15 వేల కోవిడ్ టెస్టు రాపిడ్ కిట్స్

- అద్భుతంగా ఫ్యామిలీ ఫిజీషియన్ సెంటర్లు
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్యాధికారి జమాల్‌బాషా

గంగవరం: కోవిడ్‌పై అప్రమత్తంగా ఉన్నామని, జిల్లాలో 15 వేల రాపిడ్ టెస్టు కిట్స్ సిద్ధంగా ఉన్నాయని డీఎంహెచ్‌వో జమాల్ బాషా తెలిపారు. స్థానిక పీహెచ్‌సీని సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఇక్కడ కొత్త భవనాన్ని, ఓపీ, వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యులు, వైద్య సిబ్బందితో సమీక్షించారు.జిల్లాలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని చెప్పారు. మాతాశిశు మరణాలు తగ్గించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలతో సమన్వయంతో పని చేయాలన్నారు.

పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల నిర్వహణ భేష్

జిల్లాలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల నిర్వహణ బాగుందని చెప్పారు. రంపచోడవరం, చింతూరు ప్రాంతాల్లో వైద్య సేవలతోపాటు వైద్యులు సమయపాలన, సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటన, ప్రసవాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలిస్తున్నామన్నారు. చాలా చోట్ల సంతృప్తికరంగా ఉన్నాయని తెలిపారు. పీహెచ్‌సీల్లో వైద్యుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. 60 మంది కొత్త డాక్టర్లను నియమించామన్నారు. ప్రతీ గర్భిణి ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవం చేయించుకునేలా చర్యలు తీసుకున్నామని, హైరిస్కు కేసులపై ఎక్కువగా దృష్టి పెడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఏడీఎంహెచ్‌వో అనూష, వైద్యాధికారులు భావన, కెవిన్, సాయి రతన్, ఆనంద్ పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


అల్లంపుట్టు పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డీడీ కొండలరావు

హుకుంపేట: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని గిరిజన సంక్షేమ శాఖ డీడీ వై.కొండలరావు హెచ్చరించారు. మూడు నెలల వార్డెన్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. మండలంలోని తడిగిరి పంచాయతీ అల్లంపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలల వార్డెన్ పద్ధతి అమలు కావడం లేదని ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవన్నారు. అల్లంపుట్టు పాఠశాలలో నూతన వార్డెన్‌ను నియమించి చార్జీ అప్పగించారు.